

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికేట్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ఏర్పాటు చేసింది.

8లో



అధ్యాపకుల సేవలు కనపడలేదా?

రాష్ట్రంలో సాంకేతిక వర్సిటీలలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూ కాకినాడ నుంచి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల పురస్కారానికి అర్హత గలవారు ఒక్కరూ లేరన్నట్టు కనిపిస్తుంది.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 9,00,814 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

వినాయక లడ్డూ రూ.36,500



స్వామివారి లడ్డూను పాటదారులకు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలో బండారు లంక, మట్టపర్తివారిపాలెంలో నిలబెట్టిన సిద్ధి బుద్ధి సమేత వర సిద్ధి వినాయక స్వామి నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారి 15 కేజీల మహాలడ్డును వేలంపాటలో రూ.36,500లకు డి.రవితేజ, వెంకటలక్ష్మి, తులసి అర్జున్, దివ్య దంపతులు దక్కించుకున్నారు. పాటదారులను ఉత్సవ కమిటీ ప్రతినిధులు సత్కరించి లడ్డూను అందించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కడలి రాజు, కడలి రావకృష్ణ, బొంతు శ్రీనుబాబు, మట్టపర్తి అజయ్ కుమార్, మామిడిశెట్టి విష్ణు ప్రసాద్, మట్టపర్తి రాంబాబు, మట్టపర్తి కృష్ణ నాగేంద్ర, రాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలస కార్మికుల సమస్యలపై అధ్యయనం

ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో డీఆర్వో బృందం పరిశీలన



రీజినల్ పాస్‌పోర్టు అధికారి స్నేహజను కలిసిన డీఆర్ఓ మాధవి బృందం

అమలాపురం రూరల్: జిల్లాలోని వలస కార్మికుల సంక్షేమంపై అధ్యయనానికి డీఆర్వో కె.మాధవి నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు, వలసదారుల రక్షణ కార్యాలయాలను సందర్శించింది. ముందుగా ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారి జె.స్నేహజను కలిసిన బృందం పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం ఆ బృందానికి వలసదారుల భద్రతపై ఆ కార్యాలయ అధికారి ఆనంద్ దేవులపల్లి వివరించారు. వీసా దుర్వినియోగం, అనధికారిక ఏజెంట్ల వల్ల ఎదుర్కొనే సమస్యలు, వారి డేటా సేకరణ, విదేశాల్లో మరణించిన వారికి బీమా క్లెయిమ్‌లు, పాస్‌పోర్ట్ లేని వారి పార్థివదేహాల రవాణా విధానాలు, అలాగే అధీకృత రిక్రూటింగ్ ఏజెంట్ల రిజిస్ట్రేషన్ అర్హతలు వంటి అంశాలపై చర్చించారు. పీఓఈ అసిస్టెంట్ రవి వలస విధానాలపై కేఎస్ఎం బృందం సందేహాలను నివృత్తి చేశారు. ఈ పర్యటనలో సమన్వయకర్త జి.రమేష్, కె.సత్తిబాబు, ఎస్.బి. సఫియా పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్నం వరకే సత్యదేవుని దర్శనం

అన్నవరం: భాద్రపద పౌర్ణిమ, ఆదివారం రాత్రి 9–50 గంటలకు ఏర్పడనున్న చంద్రగ్రహణం కారణంగా అన్నవరం శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామి దర్శనానికి ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తారని ఈఓ వీ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల వరకు మాత్రమే స్వామివారి వ్రతాలు, కేశఖండన టిక్కెట్లు విక్రయిస్తారు.

భావోద్వేగాల బంధానికి బైబై!

- **తపాలా సేవలపై అయోమయం**
- **ఇప్పటికే రిజిస్టర్డ్ పోస్ట్ సేవల నిలిపివేత**
- తాజాగా లెటర్ రెడ్ బాక్స్ ఎత్తివేత ప్రచారం
- అదేమీ లేదంటున్న ఆ శాఖ అధికారులు
- ఈ–సేవ విస్తరణలో పోస్టల్ శాఖ నిమగ్నం



15 పైసల పోస్టు కార్డు.. ఇన్‌లాండ్ కవర్.. కవరింగ్ లెటర్.. రిజిస్టర్డ్ పోస్టు.. టెలిగ్రాం.. ఇలా ఎన్నో సేవలు సుదీర్ఘ కాలం అందించిన తపాలా శాఖ కొన్ని బంధాలను వదిలించుకుంటోంది. కారణం.. కాలంతో పరుగులు తీయాలనుకోవడమే. సాంకేతికత రాకెట్ వేగంతో సాగుతుంటే కనీసం బుల్లెట్ ట్రైన్‌లా అయినా ముందుకు సాగకపోతే తన ఉనికికే ప్రమాదమని గ్రహించింది ఆ శాఖ. ఎస్సెమ్మెస్ మొదలైన దగ్గర నుంచి ఊపందుకున్న సాంకేతికత నేడు చాలా వేగంగా విస్తరించి అతి తక్కువ వ్యవధిలో పెద్ద పెద్ద ఫైళ్లను సైతం ఈ మెయిల్ రూపంలో చేరవేస్తోంది. ఇవన్నీ చూస్తున్న నాటి తరం కొంత నిట్టూర్పు విడుస్తున్నారు. రోజుల తరబడి నిరీక్షణ అనంతరం తాము అందుకున్న ఉత్తరాలు, రిజిస్టర్డ్ పోస్టులను గుర్తు చేసుకుని ఇక ఆ సేవలు కనుమరుగు కానున్నాయని తెలియడంతో కాస్త మనస్తాపానికి గురవుతున్నారు.

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను అందిపుచ్చుకుంటూ ఈ సేవల విస్తరణ కోసం సరి కొత్త ప్రయోగాలు చేస్తున్న పోస్టల్‌శాఖ పాత సేవలను మాత్రం ఒక్కొక్కటిగా రద్దుచేస్తూ వస్తోంది. ఇప్పటికే పలు సేవలు రద్దు కాగా, సెప్టెంబర్ 1 నుంచి రిజిస్టర్ పోస్టుసేవలు నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. మరో వైపు లెటర్ రెడ్ (పోస్టల్) బాక్స్‌ను కూడా ఎత్తివేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రధానంగా పోస్టల్ శాఖ నూతన ఒరవడితో ఈ–సేవల విస్తరణపై దృష్టి సారించినట్లుగా కనిపిస్తోంది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు లేని రోజుల్లో సమాచార వ్యవస్థకు ఉన్న ఏకైక దిక్కు తపాలానే. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మరింత సులువైన సేవలందించేందుకు సాంకేతికతకు పోస్టల్ డిపార్టుమెంట్ అప్‌గ్రేడ్ అవుతోంది.

రిజిస్టర్డ్ పోస్టుకు మంగళం

పోస్టల్‌శాఖ రిజిస్టర్ పోస్టు సేవలకు మంగళం పాడింది. తాజాగా బ్రిటీషు కాలం నుంచి వస్తున్న రిజిస్టర్డ్ పోస్ట్ సేవలు సెప్టెంబర్ 1 నుంచి నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పోస్టు మాస్టర్లకు ఇప్పటికే శాఖాపరమైన నోటీసులు జారీ చేసింది. ఒకప్పుడు బంధుమిత్రులకు కబురు పంపాలన్నా ముఖ్యమైన పత్రాలు చేరవేయలన్నా పోస్టుకార్డు లేదా రిజిస్టర్డ్ పోస్టు మాత్రమే అందుబాటులో ఉండేది.

సుమారు 171 ఏళ్లుగా..

పోస్టల్ వ్యవస్థ ప్రజల జీవితంలో విడదీయరాని భాగమైంది. కాలంతో పాటు మారిన పోస్టల్ శాఖ ఇప్పుడు మరింత ఆధునిక సేవలతో ముందుకు వస్తోంది. 1854లో అప్పటి బ్రిటిష్ అధికారి లార్డ్ డల్హౌసీ ప్రవేశపెట్టిన ఇండియా పోస్ట్ ఆఫీస్ చట్టంతో సేవలు ప్రారంభమయ్యాయి. అంతకు ముందుగా 1766లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ మెయిల్ మొదలైంది. దాదాపు 171 ఏళ్లుగా ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి రిజిస్టర్డ్ పోస్ట్ ప్రధాన మార్గంగా నిలిచింది. లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ సంబంధిత పత్రాలు వంటి వాటిని పంపడానికి ఎంతగానో ఉపయోగపడింది. పంపిన వస్తువు అవతలి వారికి చేరినట్లు రసీదు (డెలివరీ ప్రూఫ్) పొందడం ఒక ప్రత్యేకత, చట్ట పరంగా సైతం ఎంతో విలువైనది.

స్పీడ్ పోస్టులో విలీనం

రిజిస్టర్డ్ పోస్టు సేవను పూర్తిగా స్పీడ్ పోస్టు సేవలో విలీనం చేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. ఆ శాఖ తమ సేవలను ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగా దేశీయ పోస్టల్ సేవల క్రమబద్ధీకరణ, పనితీరు మెరుగుపరచడం, ట్రాకింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం తదితర ప్రక్రియలో భాగంగానే స్పీడ్‌పోస్టులో రిజిస్టర్డ్ పోస్టు విలీనం చేస్తున్నట్లు వెల్లడించింది. స్పీడ్ పోస్టు అంటే వేగవంతమైన డెలివరీ. ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్టు సేవలు స్పీడ్‌పోస్టులో కలపడంతో డెలివరీలు మరింత వేగవంతంగా గమ్యాన్ని చేరనున్నాయి. స్పీడ్ పోస్టు ద్వారా పార్శిల్ ఎక్కడి వరకు చేరిందో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఒకే సేవ ఉండటం వల్ల పోస్టల్ శాఖ పని మరింత సులభమవుతుందని అధికారులు చెప్తున్నారు.

తగ్గిన ఆదరణ.. పెరిగిన సాంకేతికత..

వాస్తవంగా రిజిస్టర్డ్ పోస్ట్ వాడకం గణనీయంగా తగ్గింది. వాట్సాప్, జీ మెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల రాకతో సమాచార మార్పిడి చాలా వేగవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఇప్పుడు డిజిటల్ మార్గంలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం సాగిన రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్‌లను పరిశీలిస్తే 25 శాతం పడిపోయాయి. స్పీడ్ పోస్టు, ఇతర కొరియర్ల సేవలు అందుబాటులోకి రావడంతో రిజిస్టర్డ్ పోస్టు డిమాండ్ అంతకంతకూ తగ్గుతూ వచ్చింది. అయితే తాజాగా స్పీడ్ పోస్టుతో చార్జీల మోత తప్పని పరిస్థితి కనిపిస్తోంది. రిజిస్టర్డ్ పోస్ట్ కనీస చార్జి రూ.26 నుంచి రూ.30 వరకు ఉంటుంది. స్పీడ్ పోస్ట్ కనీస చార్జి రూ.41 ఇది రిజిస్టర్డ్ పోస్ట్‌తో పోలిస్తే 20 నుంచి 25 శాతం ఎక్కువ. ఇక చార్జీల భారం మోయకతప్పదు.

రెడ్ పోస్టు బాక్స్ ఎత్తివేత ఊహాగానమే..

రిజిస్టర్డ్ పోస్ట్ సేవల రద్దు నేపథ్యంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రెడ్‌పోస్టు ఎత్తివేత ప్రచారం జోరుగా సాగుతోంది. సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. దీంతో పోస్టల్ శాఖ అభిమానులు ఒకింత కలవరానికి గురవుతున్నారు. దశాబ్దాలుగా నిస్వార్థంగా.. నిశ్శబ్దంగా.. నిశ్చలంగా.. విశ్వసనీయంగా సేవలు అందించిన భావోద్వేగాల నేస్తం ఇక కనిపించిందన్న బాధ వారిలో వ్యక్తమవుతోంది. అయితే ఇందులో ఎలాంటి వాస్తవం లేదని, అది ఒక ఊహాగానమేనని పోస్టల్ వర్గాలు అంటున్నాయి. పోస్టల్ శాఖ ద్వారా ఎరుపు పోస్ట్‌బాక్సును ఎత్తివేస్తున్నట్లు అధికారిక ప్రకటన ఏదీ లేదని స్పష్టం చేస్తున్నారు.

ఆదేశాలు లేవు..



పోస్టుబాక్సు ఉండవని సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారం కేవలం ఊహాగానమే. ఇప్పటి వరకు పోస్టు బాక్సు తొలగింపునకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు. కేవలం రిజిస్టర్ పోస్టు మాత్రమే నిలిపివేశారు.

– దాసరి నాగేశ్వరరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్, కాకినాడ

గురువుకు విగ్రహం!

గురుభక్తిని చాటుకున్న పూర్వ విద్యార్థులు



గంగారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ రాజు

రాజోలు: తల్లి, తండ్రి, గురువు ప్రత్యక్ష దైవాలు అనే మాటలను నిజం చేసి తమకు పాఠాలు బోధించిన గురువు విగ్రహాన్ని శిష్యులు గురువు ఇంటి ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. శుక్రవారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏపీ సూర్యనారాయణరాజు చింతలపల్లి గ్రామంలో స్వర్గీయ ఉపాధ్యాయుడు గుబ్బల గంగారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన బోధించిన పాఠాలు, వ్యక్తిత్వ వికాసాలు, జీవిత మార్గదర్శకాలను ఆదర్శంగా తీసుకున్న పూర్వ విద్యార్థులు ఆయన ఇంటి ఆవరణలో గంగారావు విగ్రహాన్ని ప్రతిష్ఠించి గురుభక్తిని చాటారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ గంగారావు గణిత బోధనలో గొప్పవారిగా నిలిచారన్నారు. ఆయన జ్ఞాపకార్థం శిష్యులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, నాయకులు దంతులూరి చంటిబాబు, పెదబాబు, పి.గన్నవరం వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయం రేపు మూసివేత

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం కోటసత్తెమ్మ అమ్మవారికి యథావిధిగా పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం 4 గంటలకు మూసివేసి తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు సంప్రోక్షణ అనంతరం అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులంతా ఈ విషయాన్ని గమనించి అమ్మవారి దర్శనానికి రావాలని ఆయన పేర్కొన్నారు.

ఏపీని మెడికల్ మాఫియా చేయాలని చూస్తున్న చంద్రబాబు

- జగన్ తెచ్చిన మెడికల్ కాలేజీల్లో 10 అమ్మేయడం ఏమిటి?
- ప్రభుత్వ తీరుపై మాజీ భరత్‌రామ్ మండిపాటు



మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: అపారమైన అనుభవం ఉందని చెప్పే చంద్రబాబు 15 ఏళ్ల పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా తీసుకురాకుండా జగనన్న తీసుకువచ్చిన 10 మెడికల్ కాలేజీలు అమ్మేయాలని చూడటం దారుణమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఏపీని మెడికల్ మాఫియా చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు గమనించి, ఏ ఏ జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ఉన్నాయో వాటిని మినహాయించి, లేని ప్రాంతాల్లో 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వ పరంగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చి, నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వాటిలో రాజమహేంద్రవరం వంటి ఐదు ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీల్లో ద్వితీయ సంవత్సరం కూడా క్లాసులు ప్రారంభమయ్యాయన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఎదురుగా 35 ఎకరాల్లో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం ప్రారంభిస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిన్నర కాలంలో పనులు నత్తనడకన నడుస్తున్నాయని ధ్వజమెత్తారు. మొదటి బ్యాచ్ పూర్తయి డాక్టర్లు బయటకు వచ్చే సమయానికి కూడా భవన నిర్మాణాలు పూర్తవుతాయన్న నమ్మకం లేకుండా పోయిందన్నారు. అంతేకాకుండా జగనన్న తెచ్చిన మెడికల్ కాలేజీల్లో పది మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం 99 ఏళ్లకు అమ్మేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుని కాలరాయడానికి చంద్రబాబుకి ఏ అధికారం ఉందని ప్రశ్నించారు. ఎవరైనా మెడికల్ కాలేజీలు పెడతామన్నా, సీట్లు పెంచుతామన్నా ఆనందంగా ముందుకు వస్తారని, అయితే చంద్రబాబు అందుకు విరుద్ధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు పెంచొద్దని లేఖ రాయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేయడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను కూడా నిర్వీర్యం చేసి, తద్వారా పేదలకు వైద్యం అందకూడదన్నది చంద్రబాబు ఉద్దేశంగా ఉందని భరత్‌రామ్ ధ్వజమెత్తారు.

ఇలా తగ్గి.. ఇంతలోనే అంతై ముంపు..

- 20 రోజులుగా వరద పరిస్థితి ఇదీ..
- అవస్థలు పడుతున్న లంక వాసులు



అన్నంపల్లి అక్విడెక్టు వద్ద తగ్గని వరద ఉధృతి



ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పల్లెపాలెం వద్ద ముంపు వీడని కూరగాయ పంటలు

ఐ.పోలవరం: గోదావరి వరద లంకవాసులతో దోబూచులాడుతోంది. గత నెల ఆగస్టు 15 నుంచి శుక్రవారం వరకు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని లంక గ్రామాల వాసులు, ఏటిగట్టును ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నివాసిస్తున్న వారిని ఇక్కట్ల పాలు చేస్తోంది. సుమారు 20 రోజులుగా గోదావరి వరద ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని 10 గ్రామాలపై ప్రత్యక్షంగాను, పరోక్షంగా ప్రభావం చూపుతోంది.

గోదావరికి ఈ ఏడాది జూలై 26వ తేదీన స్వల్పంగా వరద వచ్చింది. తరువాత ఆగస్టు 15వ తేదీన మరోసారి వరద రాగా అది తగ్గే సరికి ఆగస్టు 22వ తేదీ నుంచి మరోసారి వరద వచ్చింది. నాటి నుంచి శుక్రవారం వరకు వరద తగ్గుతూ.. పెరుగుతూ.. తగ్గుతూ లంక వాసులు, ఏటిగట్టును ఆనుకుని ఉన్న సామాన్యులతో దోబూచులాడుతూనే ఉంది. దీని వల్ల వైనతేయ, గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయలను ఆనుకుని ఉన్న లంక గ్రామాలు, ఏటిగట్టును ఆనుకుని ఉన్న గ్రామాలు పలు సందర్భాలలో ముంపుబారిన పడుతున్నాయి. ఇళ్లు వరద ముంపులో చిక్కుకున్నాయి. రోడ్లు కూడా వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇళ్లు, తోటల్లో వరద నీరు చేరింది.

గోదావరి వరద ఎగువన ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శుక్రవారం ఉదయం నుంచి తగ్గుముఖం పడుతోంది. కానీ దిగువన ఉన్న ముమ్మిడివరం మండల పరిధిలోని గురజాపులంక, లంక ఆఫ్ ఠాన్నేల్లంక, ఐ.పోలవరం మండల పరిధిలో మురమళ్ల, కేశనకుర్రు పంచాయతీ శివారు పల్లిగూడెం, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు, బలుసుతిప్ప, అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం వాసులు వరద ప్రభావాన్ని నేరుగా చూశారు. వరదల వల్ల స్థానిక రైతులు విలువైన కూరగాయ పంటలను కోల్పోయారు. అరటి, బొప్పాయి, కంద, వంగ, బీర, బెండ, టమాటాతో పాటు పందిరి కూరగాయలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. అలాగే మత్స్యకారులకు గడిచిన 20 రోజులుగా మత్స్య సంపద లభ్యం కాకపోవడం వల్ల జీవనోపాధికి గండి పడి పస్తులుంటున్నారు. ఇప్పటికీ వరద పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో వారు కష్టాలు వీడలేదు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- కలెక్టర్ మహేష్ కుమార్
- జిల్లాలో 64 మందికి ఉత్తమ పురస్కారాల ప్రదానం

అమలాపురం రూరల్: ఉపాధ్యాయులు జీవిత మార్గదర్శకులు, సమాజ నిర్మాణ శిల్పులని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులు జీవిత మార్గదర్శకులు, సమాజ నిర్మాణ శిల్పులని పేర్కొన్నారు. తల్లి, తండ్రి, గురువు నిత్యం పూజ్యనీయులన్నారు. గురి, లక్ష్యం, దిశ, మార్గం చూపే వారే గురువు అని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. విశిష్ట సేవలతో విద్యారంగాన్ని అలంకరించిన దిగ్గజ ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేయడం అభినందనీయమన్నారు. 64 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మాన పత్రాలతో సత్కరించారు. డీఆర్‌ఓ కొత్త మాధవి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిని పవిత్రమైనదిగా భావించి విద్యాబోధన చేసేవారన్నారు. అందుకే ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం విశేషమన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ భారతదేశ మొట్ట మొదటి ఉప రాష్ట్రపతి, రెండో రాష్ట్రపతిగా పని చేసిన సర్వేపల్లి గొప్ప తత్వవేత్తగా భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టారన్నారు. డీఈవో షేక్ సలీం బాషా మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దు కుంటుందన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వే పల్లి రాధాకృష్ణ సమాజానికి, విద్యార్థులకు మార్గదర్శి ఉపాధ్యాయుడన్నారని పేర్కొన్నారు. తన జ్ఞానాన్ని విద్యార్థులకు పంచుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాడని, విలువలు, దేశభక్తిని నేర్పుతాడని ఆదర్శంగా జీవిస్తాడన్నారు. అందుకే గురువు స్థానం వెలకట్టలేనిదన్నారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్న ట్టు విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా ఉపాధ్యాయుల వద్ద ఓనమాలు నేర్చుకున్న వారేనని అందుకే వారికి సముచిత గౌరవం దక్కుతుందన్నారు. ఏపీసీ జి.మమ్మి మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉందని, అజ్ఞానాన్ని పారదోలి జ్ఞాన మా ర్గంలో నడిపించడం గురువుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, డీసీసీబీ సభ్యులు బి.హనుమంతరావు, డీఎస్ఓ జీవీఎస్ సుబ్రహ్మణ్యం సీఎంఓ సుబ్రహ్మణ్యం, ఏఎంవో రాంబాబు, ఉప విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పొగాకు నారుమడులు

- 65 హెక్టార్లలో నర్సరీలు
- దసరా నుంచి నాట్లకు సన్నాహాలు
- ట్రే నర్సరీలపై రైతుల ఆసక్తి
- 70 వేల ఎకరాల్లో పంట సాగు



దేవరపల్లి మండలం పల్లంట్లలో ఆశాజనకంగా పొగాకు నారుమడులు



బుచ్చియపాలెంలో ట్రేలలో నాటుతున్న నారు మొక్కలు

దేవరపల్లి: పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2025–26 పంట కాలానికి పొగాకు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన నారును నర్సరీల్లో విత్తనం వేసి పెంచుతున్నారు. బోర్డు నిబంధనల మేరకు రైతులు, వ్యాపారులు నారుమడులు కట్టి పెంచుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది నారుమడి దశ నుంచి బోర్డు నిబంధనలను కఠినతరం చేసింది. నారుమడి కట్టే రైతులు తప్పనిసరిగా బోర్డులో నర్సరీని రిజిస్ట్రేషన్ చేయించుకోవలసి ఉంది. పొగాకు పంట సాగు చేసే రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యాపారులు, రైతుల నుంచి నారు కొనుగోలు చేయవలసి ఉంది. నారు అమ్మిన రైతు నుంచి నారు కొనుగోలు సమయంలో రశీదు తీసుకుని బోర్డు కార్యాలయంలో మొక్క ఫారంతో పాటు అధికారులకు అందజేయవలసి ఉంది. ప్రస్తుతం పొగాకు నారుమడులు ముమ్మరంగా కడుతున్నారు.

నర్సరీల విస్తీర్ణం పెరిగే అవకాశం

దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 65 హెక్టార్లలో పొగాకు నర్సరీలు వేసినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దీనిలో సుమారు 34 హెక్టార్లు కమర్షియల్, 21 హెక్టార్లు డొమెస్టిక్ నర్సరీలు ఉన్నాయి. ఈ నెలాఖరుకు నర్సరీల విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల, దేవరపల్లి, బందపురం, యర్నగూడెం, సంగాయగూడెం, చిన్నాయగూడెం గ్రామాల్లో ఎక్కువగా పొగాకు నారుమడులు కడుతున్నారు. పల్లంట్ల, దేవరపల్లి, లక్ష్మీపురం, బందపురం గ్రామాల్లో కమర్షియల్ నర్సరీలు కడుతున్నారు. కమర్షియల్ నర్సరీలు కట్టేవారిలో 90 శాతం కౌలుదారులు ఉన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం, తాళ్లపూడి మండలం మలకపల్లి, ప్రాంతాల్లో కమర్షియల్ నారుమడులు కడుతున్నారు. ఇక్కడ వేసిన నారుకు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు ప్రాంతాలతో పాటు తెలంగాణలోని అశ్వారావుపేట, ఖమ్మం ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేసి తీసుకువెళతారు. ఎకరం విస్తీర్ణంలో పెంచిన నారు సుమారు 1,200 ఎకరాల్లో సాగుకు సరిపోతుందని రైతులు తెలిపారు.


ట్రే నారుపై రైతుల ఆసక్తి

ట్రేలలో పెంచిన నారుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ట్రే నారు ఆరోగ్యకరంగాను, ధృడంగా ఉండి నాటిన అనంతరం చీడపీడలను తట్టుకుంటుందని రైతులు తెలిపారు. పొగాకు సాగు చేసే రైతులంతా ట్రే నారుపై మొగ్గు చూపుతున్నారు. ట్రే నారు ధర ఎక్కువగా ఉన్నప్పటికి రైతులంతా దీనినే కొనుగోలు చేస్తారు. ఏటా దాదాపు 70 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేస్తున్నారు.

అధిక దిగుబడుల వంగడాలు సాగు

అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. సాగుకు అవసరమైన విత్తనాలను సీటీఆర్ఐ, ఐటీసీ సంస్థలు రైతులకు సరఫరా చేస్తున్నాయి. కిలో విత్తనాలకు వంగడాన్ని బట్టి రూ.15 వేలు ధర ఉంది. ఎల్‌వీ–7, 1353 వంగడాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ వంగడాలు ఎకరాకు సుమారు 10 నుంచి 13 క్వింటాళ్ల పొగాకు దిగుబడి వస్తున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



బోర్డు నిబంధనలు ఉల్లంఘించి పొగాకు నర్సరీలు వేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి. పంట నియంత్రణలో భాగంగా ఈ ఏడాది నర్సరీ దశ నుంచి నిబంధనలు కఠినతరం చేశాం. నర్సరీ వేసే ప్రతి రైతు బోర్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. నర్సరీల తనిఖీకి బోర్డు బిజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసింది. రిజిస్ట్రేషన్ ఉన్న నర్సరీల నుంచి రైతులు నారు కొనుగోలు చేయాలి. నారు అమ్మిన వ్యాపారి నుంచి తప్పనిసరిగా రశీదు పొందాలి. రశీదు పుస్తకాలను బోర్డు ద్వారా నర్సరీ యజమానులకు అందజేస్తున్నాం. అక్టోబర్ నుంచి పొగాకు నాట్లు ప్రారంభం కానున్నాయి.

– జీఎల్‌కే ప్రసాద్, పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

అట్రాసిటీ కేసు నమోదు

రంగంపేట: తనను కులం పేరుతో దూషించాడని ఓ మహిళా వ్యవసాయ కూలీ చేసిన ఫిర్యాదుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజానగరం మండలం సూర్యారావు పేట గ్రామానికి చెందిన దొండపాటి దుర్గ రంగంపేట మండలం ఈలకొలను గ్రామంలో నురుకుర్తి సాల్మన్‌రాజుకు చెందిన పొలంలో తోటి మహిళలతో కలసి పొలం పని చేస్తోంది. ఈ నేపథ్యంలో బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన మల్లిడి శ్రీనివాస్‌రెడ్డి ఓ వివాదం విషయంలో తనను కులం పేరుతో దూషించినట్టు దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

ఆభరణాల చోరీ నిందితుడి అరెస్టు : సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులతో పాటు నిందితుడు చరణ్‌ను చూపుతున్న పోలీసులు

తాళ్లరేవు: నీలపల్లి గ్రామం వికాస్ లే అవుట్‌లోని ఒక ఇంట్లో బంగారు, వెండి వస్తువులను చోరీ చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. జూన్ 12వ తేదీన ఆ లే అవుట్‌లోని ఒక ఇంటిలోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి బంగారం, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు పలివెల చరణ్‌ను అరెస్ట్ చేసి రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టామన్నారు.

డీఎస్సీలో విఫలమై ఆత్మహత్య

రాజానగరం: ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలనే ఆశ నెరవేరడం లేదని, ఎన్నిసార్లు డీఎస్సీ రాసినా క్వాలిఫై కాలేకపోతున్నానని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని కొంతమూరులో శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రాజానగరం పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. అవివాహితుడైన ముర్ల తేజకుమార్ (30) ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫై కాలేకపోయాడు. దీనితో మనోవ్యధకు లోనై ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు తేజకుమార్ తండ్రి నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రియకుమార్ తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12వేల స్కాలర్‌షిప్
- ఎంపికైన వారికి నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్
- ఈ నెల 30 దరఖాస్తుకు తుది గడువు
- డిసెంబరు 7న ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్ష



తరగతి గదిలో చదువుతున్న విద్యార్థులు

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికేట్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో ఎంపికైన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేలు వంతున నాలుగేళ్లకు మొత్తం రూ.48 వేలు అందజేస్తారు. అయితే ఇంటర్ విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే చదవాల్సి ఉంటుంది. వసతిగృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వరు. డే స్కాలర్‌గా ఉన్న విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.

పేద విద్యార్థులకు భరోసా..

కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఏటా పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని 2008–09లో ప్రవేశపెట్టారు. ఇది పేద విద్యార్థుల విద్యకు భరోసా కల్పిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు.

ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.12 వేల వంతున నాలుగేళ్ల పాటు విద్యార్థికి స్కాలర్‌షిప్ నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. పదో తరగతి ఉత్తీర్ణత అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారికి మాత్రమే స్కాలర్‌షిప్ కొనసాగిస్తారు. ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివిన వారికి కూడా స్కాలర్‌షిప్ కొనసాగింపు ఉండదు. ఏటా జిల్లా నుంచి సుమారు వందలాది మంది ఎంపికవుతున్నారు.

డిసెంబరు 7న అర్హత పరీక్ష

పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబరు 7న అర్హత పరీక్ష నిర్వహిస్తారు. అదేరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు అర్హులు. ఆబ్జెక్టివ్ విధానంలో 180 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. 90 మార్కులకు రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లిష్ ఉండగా, మరో 90 మార్కులకు 7, 8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం కేటాయిస్తారు. జిల్లా ప్రాతిపదికగా స్కాలర్‌షిప్‌కు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తులు

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల డైస్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాలి. దరఖాస్తులో విద్యార్థి పూర్తి వివరాలను ఉపాధ్యాయుడి సమక్షంలో పొందుపరచాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి.

అర్హతలివీ

ప్రస్తుతం ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తులకు అర్హులు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీ కాగా, పరీక్ష రుసుం చెల్లించేందుకు అక్టోబరు ఒకటో తేదీ తుది గడువు. ప్రధానోపాధ్యాయులు ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించడానికి ఈ నెల 30 చివరి తేదీ.

జిల్లాలో పరిస్థితి ఇదీ

గత విద్యా సంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 2,815 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి గతేడాది డిసెంబరు ఎనిమిదో తేదీన 13 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షకు 2,688 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 142 మంది ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సుమారు 12,131 మంది 8వ తరగతి విద్యాభ్యాసం చేస్తున్నారు.

అధిక సంఖ్యలో దరఖాస్తు చేయించాలి



ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చూడాలి. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈఓ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పేద విద్యార్థులకు వరం



నిరుపేద విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ఒక వరం. జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎన్ఎంఎంఎస్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు అర్హత సాధించేలా సంబంధిత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

చెడు వ్యసనాలకు బానిసలై చోరీలు

- పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర ముఠా
- 64 గ్రాముల బంగారం.. 2.88 కేజీల వెండి వస్తువుల స్వాధీనం



చోరీ సొత్తు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు: చెడు వ్యసనాలకు లోనై చోరీల బాట పట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా రాజోలు పోలీసులకు చిక్కారు. శుక్రవారం రాజోలు సర్కిల్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్‌కుమార్, క్రైమ్ సీఐ గజేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న రాజోలు మండలం బి.సావరం గ్రామానికి చెందిన కట్టా అర్జున్, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన సోదెం మంగప్రసాద్, రాజమహేంద్రవరానికి చెందిన షేక్ బాషి అలియాస్ బాషా, కాకినాడకు చెందిన షేక్ అజీజ్‌లను అరెస్ట్ చేసి రాజోలు కోర్టులో హాజరు పర్చారు. వీరిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు పోలీస్‌స్టేషన్‌లో మూడు, ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తూర్పుగోదావరి జిల్లా ఇరగవరం పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో రెండు, కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వీఎం బంజారా పోలీస్‌స్టేషన్‌లో ఒకటి మొత్తం 10 కేసులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఈ ముఠా చోరీ చేసి 64.106 గ్రాముల బంగారం, 2.859 కేజీల వెండి వస్తువులు, రూ. 2.80 లక్షలు నగదును పోలీసులు రికవరీ చేశారు. షేక్ అజీజ్ కాకినాడలోని ఒక నర్సింగ్ హోంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి చోరీల బాట పట్టాడు. అజీజ్‌కు కట్టా అర్జున్, సోదెం మంగప్రసాద్‌లు రాజమండ్రి సెంట్రల్ జైలులో పరిచయమ్యారు. వీరిద్దరితో అజీజ్ దొంగతనాలు చేయిస్తూ, తను కూడా దొంగతనాలు చేసేవాడు. వీరు దొంగిలించిన చోరీ సొత్తును షేక్ బాజీ విక్రయించేవాడు. అజీజ్‌పై ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 75కు పైగా దొంగతనం కేసులు, కట్టా అర్జున్‌పై 10కి పైగా దొంగతనాలు కేసులు, షేక్ బాషిపై మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో అక్రమ గంజాయి రవాణా కేసు నమోదు చేశారు. చోరీ కేసు ఛేదించిన రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, అమలాపురం సీసీఎస్ క్రైమ్ సీఐ ఎం. గజేంద్రకుమార్, ఎస్సైలు పరదేశి, ఎస్. రాజేష్‌కుమార్, ఏఎస్ఐ బాలకృష్ణ, క్రైమ్ హెచ్‌సీలు కె.రమణ, ఎం.రమేష్, పి.కిషోర్, ఎం.శేఖర్‌రాజు, కేవీ రమణ, కానిస్టేబుళ్లు బీఎన్‌వీఎస్ఎస్ రెడ్డి, ఆర్. శ్రీను, డి.అర్జున్, ఎం.హరిబాబు, జి.సాయి, బి.ప్రసాద్, ఎ.సుభాకర్, ఐ.శ్రీను, ఆర్.ప్రసాద్‌లను ఎస్పీ బీవీ కృష్ణారావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్ అభినందించారు.


విలాసాలాలకు అలవాటు పడి
మోటారు సైకిళ్ల చోరీ



కోరుకొండ పోలీస్ స్టేషన్ వద్ద నిందితులు, చోరీ చేసిన మోటారు సైకిళ్లతో పోలీసు అధికారులు

కోరుకొండ: మండలంలోని గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులను 11 మోటారు సైకిళ్లతో కోరుకొండ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విలాసాలకు అలవాటు పడి రాజమహేంద్రవరం, కోరుకొండ, రాజానగరం, సీతానగరం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆ వాహనాలను వారు చోటీ చేసిన ట్లు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. స్కూటీలను చోరీ చేయడం వీరు లక్ష్యంగా తీసుకుని తొమ్మి దింటిని చోరీ చేసినట్లు తెలిపారు. చోరీ చేసిన వాహనాలను గాదరాడలో అల్లాడి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దాచేవారు. విజయ్‌కుమార్ అదే గ్రామానికి చెంది న వనుం సురేష్, వనుం లోవరాజులతో కలిసి ఈ వాహనాల చోరీకి పాల్పడ్డాడు. ఇటీవల కోరుకొండలో ని స్ప్లెండర్ ప్లస్ వాహనాన్ని చోరీపై పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సోదాలు నిర్వహించగా 11 మోటార్లు సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి ముందు నిలిపిన మోటారు సైకిళ్లను చోరీ చేయడంలో వారు నిష్ణాతులని, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు అధికారిగా ఎస్సై కేవీ నాగార్జున ఉన్నారు. విలేకరుల సమావేశంలో కోరుకొండ సీఐ సత్యకిశోర్ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

గణపతి విగ్రహం రూ.1.11 లక్షలు



వేలంలో గెలుచుకున్న గణపతి విగ్రహం

దేవరపల్లి: వినాయక చవితి సందర్భంగా దేవరపల్లి మెరకవీధి వినాయకుడి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణేశుని విగ్రహాన్ని వేలంపాటలో రూ.1.11 లక్షలకు ఆకుల నాగేశ్వరరావు కుమారుడు నాని దక్కించుకున్నాడు. గురువారం రాత్రి నిర్వహించిన వేలంపాటలో దక్కించుకున్న విగ్రహాన్ని శనివారం పురవీధుల్లో ఊరేగించి నిమజ్జనం చేయనున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం



రాంబాబు మృతదేహం

- పదవీ విరమణ ప్రోత్సాహకాలు రావన్న అనుమానంతో భర్తపై దాడి
- తలపై ఇనుప రాడ్‌తో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి

అమలాపురం రూరల్: భర్త వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కోపంతో అతని భార్య ఇనుపరాడ్డుతో అతడి తలపై దాడిచేసి హతమార్చిన ఘటన మండలం నడిపూడిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నడిపూడి గ్రామ పరిధి మెట్ల రాంజీ కాలనీకి చెందిన దొమ్మేటి రాంబాబు (61) కాకినాడ ఆర్టీసీ చెకింగ్ స్క్వాడ్‌లో పనిచేస్తున్నాడు. అతని భార్య వెంకటరమణతో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. ఒక కుమార్తెకు ఒకసై వివాహం చేశారు. కాగా రాంబాబు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంపై తరచూ ఆ భార్యాభర్తలు ఘర్షణ పడేవారు. ఈ క్రమంలో ఒక ఇంట్లోనే వారు వేరువేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన రాంబాబుతో అతని భార్య ఘర్షణపడింది. అనంతరం అర్ధరాత్రి నిద్రలో ఉన్న భర్త రాంబాబు తలపై ఇనుప రాడ్డుతో భార్య వెంకటరమణ దాడి చేసింది. దీంతో అతను ప్రాణాలు విడిచాడు. ఈ విషయం శుక్రవారం సాయత్రం బయటికి రావడంతో సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై శేఖర్ బాబు ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించి వెంకటరమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా రాంబాబు ఉద్యోగ విరమణ దగ్గర పడడంతో అతడికి వచ్చే ప్రోత్సాహకాలు తనకు దక్కవనే అనుమానంతో ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. రాంబాబు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శేఖర్ బాబు తెలిపారు.

రత్నగిరిపై భూగర్భ విద్యుత్ లైన్లు

- రూ.28 లక్షల వ్యయంతో ఏర్పాటు
- పాలకవర్గ సమావేశంలో నిర్ణయం
- కార్తికమాసం ఏర్పాట్లపై చర్చ



కార్తికమాసం ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో చర్చిస్తున్న చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ సుబ్బారావు

అన్నవరం: రత్నగిరిపై స్వామివారి నిత్య కల్యాణ మండపం, వ్రత మండపాలకు స్వామి వారి ఆలయానికి రత్నగిరి పవర్‌హౌస్ నుంచి అండర్ గ్రౌండ్ కేబుళ్ల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.28 లక్షలతో రూపొందించిన అంచనాలకు దేవస్థానం పాలకవర్గం ఆమోదం తెలిపింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చలు జరిపి తీర్మానాలు చేశారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తీర్మానాలివీ..

- సుమారు రూ.40 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూపొందించిన అంచనాలపై చర్చించి ఆమోదం తెలిపారు.
- గత నెలలో నిర్వహించిన కొబ్బరి ముక్కలు, బుకింగ్ కౌంటర్ వద్ద మూడో నెంబర్ షాపు, ఇతర షాపుల వేలంపాటలలో హెచ్చు మొత్తం వేలంపాటలకు ఆమోదం తెలిపారు.
- సత్యగిరిపై రహదారుల నిర్మాణానికి పిలిచిన రూ.32 లక్షలు టెండర్‌కు ఆమోదం.

కార్తికమాసం ఏర్పాట్లపై చర్చ

అక్టోబర్ 22వ తేదీ నుంచి నవంబర్ 18వ తేదీ వరకు కొనసాగనున్న కార్తికమాసంలో వచ్చే భక్తుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు చర్చించి పలు నిర్ణయాలు తీస్కున్నారు. ప్రధానంగా రూ.7.70 లక్షల వ్యయంతో తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, రూ.ఐదు లక్షల వ్యయంతో షామియానాలు, రూ.పది లక్షలతో తాత్కాలిక క్యూ లైన్లు నిర్మాణం, రూ.ఐదు లక్షలతో తెప్పోత్సవానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

పిచ్చి కుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

నల్లజర్ల: మండలంలోని ఆవపాడు గ్రామంలో శుక్రవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. స్థానిక దుర్గమ్మగుడి వద్ద ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహిస్తారు. ఆ భోజనాలకు వచ్చిన మహిళలను, కంబాల కృష్ణ మనోహర్‌తో పాటు ఏడుగురిపై ఆ కుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో ఆ గ్రామస్తులు దానిని హతమార్చారు. గాయపడిన వారికి నల్లజర్ల పీహెచ్‌సీలో చికిత్స చేసి పంపారు.

సమస్యలపై రాజీ లేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ సూర్యనారాయణ

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేసేందుకు వెనకాడబోమని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ జిల్లా ఉద్యోగులకు హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ అధ్యక్షతన స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన 'ఉద్యోగులారా…రండి…టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డీఏల బకాయిలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రామ సూర్యనారాయణకు జిల్లా రెవెన్యూ శాఖ నుంచి వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రేడ్–2 వీఆర్వోలు, మెడికల్, హెల్త్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు (పెన్షనర్లు) తమ అపరిష్కృత సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, జిల్లా కోశాధికారి జేఏ రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్, కొప్పిశెట్టి గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి పి.శివకుమార్, జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ముందుకు సాగుతామని జిల్లా సంఘం ఉద్యోగులు స్పష్టం చేశారు.

అధ్యాపకుల సేవలు కనపడలేదా?

- జేఎన్‌టీయూకేకు దక్కని ఉత్తమ పురస్కారం
- వర్సిటీ చరిత్రలో మచ్చగా మిగలనున్న వైనం
- రాయలసీమ వర్సిటీల నుంచి ముగ్గురికి అవకాశం



జేఎన్‌టీయూ కాకినాడ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్రంలో సాంకేతిక వర్సిటీలలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూ కాకినాడ నుంచి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల పురస్కారానికి అర్హత గలవారు ఒక్కరూ లేరన్నట్టు కనిపిస్తుంది. ప్రొఫెసర్ల హోదా కలిగి అధ్యాపక వృత్తిలో 20 నుంచి 30 ఏళ్ల సర్వీస్ ఉన్న వారిలో ఒక్కరికీ అవకాశం దక్కలేదు. ఏటా కనీసం ఇద్దరు ప్రొఫెసర్లకు అవకాశం దక్కేది. కానీ ఈ ఏడాది నలుగురు పేర్లు ప్రతిపాదించినా కనీసం వారిలో ఒక్కరి పేరు కూడా రాకపోవడం వర్సిటీ ప్రతిష్ఠకు మచ్చగా మిగిలిపోతుంది. వర్సిటీకు రిజిస్ట్రార్లుగా పనిచేసిన ఇద్దరు, మరో సీనియర్ ప్రొఫెసర్‌తో పాటు, డైరెక్టర్‌గా పనిచేసిన ఒక ప్రొఫెసర్ పేరు ప్రతిపాదించగా వీరిలో కనీసం ఒక్క పేరునూ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఏపీ ఎంసెట్, ప్రభుత్వ ఉద్యోగాల వంటి కీలక పరీక్షల నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వం ఈ వర్సిటీకే అప్పగిస్తున్న తరుణంలో ఏ ఒక్క ప్రొఫెసర్ ఉత్తమ అధ్యాపకుడిగా రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించలేదా అన్న సందేహం వర్సిటీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వర్సిటీలను బలోపేతం చేస్తామంటూ జాతీయ విద్యాసంస్థల్లో పనిచేసే వారికి, ఉపకులపతులుగా నియమించిన ప్రభుత్వానికి ఇంత మంది సీనియర్ ప్రొఫెసర్లలో ఒక్కరూ కనిపించకపోవడం విస్మయానికి గురిచేసింది. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అనంతపురం వర్సిటీ నుంచి ముగ్గురు ప్రొఫెసర్లకు, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ తిరుపతి నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. దీన్ని బట్టి జేఎన్‌టీయూకేను ప్రభుత్వం అవార్డుల ఎంపికలో అసలు ప్యానల్ లిస్టులోకి తీసుకోలేదా అన్న సందేహం వర్సిటీ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది.